

డీడీలు వాపస్ !

గొల్లకుర్మల ఆర్థికాభివృద్ధికి గత ప్రభుత్వం గొర్రెల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 8లో▸



ప్రజాస్వామ్య పరిరక్షణలో..

ప్రజల హక్కులు కాపాడే న్యాయవాదులపై దాడులు చేయడం సరికాదని జీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ అన్నారు. 8లో▸



సమస్యలు పరిష్కరించాలి

ధరణి పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా నాయకుడు ఉప్పలి మల్కయ్య డిమాండ్ చేశారు. 9లో▸

న్యూస్‌రీల్

మర్రి రాజిరెడ్డికి శాంతి పురస్కారం



అవార్డు అందుకున్న రాజిరెడ్డి

బంట్వారం: క్విట్ ఇండియా డేను పురస్కరించుకొని పీసీసీ సేవా దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్రి రాజిరెడ్డికి శాంతి పురస్కారం అందజేశారు. శుక్రవారం నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో మహాత్మాగాంధీ శాంతి పురస్కార్ -2024 అవార్డును అందుకున్నారు. మర్రి రాజిరెడ్డి రెండు దశాబ్దాలుగా పర్యావరణం, శాంతి, జాతీయ సమైక్యత, మత సామరస్యం, గ్రామీణ అభివృద్ధి, వైద్య ఆరోగ్య రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్నారు. ఈ క్రమంలోనే అవార్డు అందజేసినట్లు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ.. అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. భవిష్యత్‌లో సేవా కార్యక్రమాలను విస్తరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో హై కోర్టు న్యాయవాది యశ్వంత్ ఎట్టయ్య, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

12న స్పాట్ అడ్మిషన్లు

అనంతగిరి: వికారాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 12న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ కే రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 11వ తేదీ వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాలిసెట్ ఎంట్రన్స్‌లో అర్హత సాధించిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఎస్ఎస్‌సీ మెమో, టీసీ, 4 - 10 వరకు బోనాఫైడ్, కులం సర్టిఫికెట్, ఆధార్ కార్డు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో 12వ తేదీ ఉదయం 10గంటల లోపు కళాశాలకు రావాలన్నారు. సీటు వచ్చిన విద్యార్థులు రూ.5,080 ఫీజు, కౌన్సిలింగ్ ఫీజు వెంటనే చెల్లించాల్సి ఉంటుందన్నారు. లేని పక్షంలో ఆ సీటును మరొక విద్యార్థికి కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

సాగు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి



పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: రైతులు పండించిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి అధికారులకు సూచించారు. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని ఫిరోజ్‌గూడ రెవెన్యూలో రైతులు పండించిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పంటల ప్రక్రియను సర్వే నంబర్ ఆధారంగా పరిశీలించాలని తెలిపారు. రైతులు తప్పనిసరిగా వ్యవసాయ విస్తరణ అధికారుల దగ్గర పంటల వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. పంటల సాగులో అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వరప్రసాద్‌రెడ్డి, వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి రఘు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



మంచాలలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న జాన్‌వెస్లీ తదితరులు

మంచాల: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పంచాయతీ రాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జాన్‌వెస్లీ అన్నారు. మంచాల, తాళ్లపల్లిగూడ, ఆరుట్ల గ్రామాల్లో శుక్రవారం స్వచ్ఛదనం-పచ్చదనంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలకు హాజరై విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా ప్రజలను చైతన్య పర్చాలన్నారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, మండల ప్రత్యేకాధికారి సుభాషిణి ఎంపీడీఓ బాలశంకర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులపంచమి



అనంతగిరి: పుట్టలో పాలు పోస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల తదితరులు

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నాగుల పంచమి పర్వదినాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం నాగుల కట్టలు, పుట్టల వద్దకు వెళ్లి పాలు పోశారు. ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



తాండూరు టౌన్: పుట్టకు పూజ చేస్తున్న మహిళలు

రవాణా శాఖలో కలెక్షన్ టార్గెట్!

రూ.35 లక్షలు వసూలు చేయాలని నిర్ణయం

- త్రైమాసిక పన్ను చెల్లించని వాహనాలే లక్ష్యంగా తనిఖీలు
- పట్టుబడితే 200శాతం ఫైన్ కట్టాల్సిందే
- లేకుంటే వెహికిల్ సీజ్
- జిల్లాలో మొత్తం వాహనాలు 2.30లక్షలు
- ట్యాక్సీ ప్లేట్ వాహనాలు 15వేలు



వికారాబాద్ సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఆర్టీఏ అధికారులు

వికారాబాద్: ఉన్నతాధికారులు విధించిన టార్గెట్లను పూర్తి చేయడానికి ఆర్టీఏ అధికారులు కుస్తీ పడుతున్నారు. వాహనాల త్రైమాసిక పన్ను బకాయిలు రోజురోజుకూ పెరిగి పోతుండటంతో ఆ శాఖ ఉన్నతాధికారులు వాటి వసూళ్లకు నడుంబిగించారు. కింది స్థాయి అధికారులకు టార్గెట్ విధించారు. దీంతో వారు వాహన ట్యాక్స్‌పై అవగాహన కల్పించడం మానేసి అపరాధ రుసుం వసూలుకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. జిల్లాలో డీటీఓతోపాటు ఇద్దరు ఎంవీఐలు, ఇద్దరు ఏఎంవీఐలు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ఆ శాఖ ఉన్నతాధికారులు నెలవారీ టార్గెట్లు విధించారు. నిత్యం వాహనాలను తనిఖీలు చేసి ప్రతి నెలా రూ.35 లక్షలు ఫైన్ల రూపంలో వసూలు చేయాలని ఆదేశించారు. ఒక్కో ఏఎంవీఐ రూ.10 లక్షలు, ఒక్కో ఎంవీఐ రూ.7.5 లక్షలు చొప్పున వసూలు చేయాల్సి ఉంది. దీంతో వారు ఎప్పుడు చూసినా రోడ్లపైనే కనిపిస్తున్నారు. గడువులోగా వెహికల్ టాక్స్ చెల్లిస్తే రూ.1,000తో సరిపోతుంది. గడువు దాటాక రూ.1,500 చెల్లించాల్సి ఉంటుంది. అదే ఆర్టీఏ అధికారుల తనిఖీల్లో పట్టుబడితే 200 శాతం అధికంగా ఫైన్ కట్టాలి. అంటే వెయ్యి రూపాయలకు అదనంగా రూ.2 వేలు చెల్లించాల్సి ఉంటుంది.

బకాయిలు రూ. కోటిపైనే..

జిల్లాలో అన్ని రకాల వాహనాలు కలిపి 2.30 లక్షల వరకు ఉంటాయి. వీటిలో 15వేలకు పైగా ట్యాక్సీ ప్లేట్ వాహనాలు ఉన్నాయి. త్రీ ప్లస్ వన్ వాహనాలు, సెవెన్ సీటర్ ఆటోలు త్రైమాసిక పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. ఫోర్ వీలర్‌లో ట్యాక్సీ ప్లేట్ వాహనాలు, సరుకు రవాణా వాహనాలు మాత్రం ప్రతి మూడు నెలలకు ఒక్కసారి ప్రభుత్వానికి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఇలాంటి వాహనాలు జిల్లాలో ఆరు వేల వరకు ఉంటాయి. వీటిలో దాదాపు మూడు వేల వాహనాలకు సంబంధించి పన్ను పెండింగ్‌లో ఉంది. ఈ మొత్తం కోటి రూపాయల పైగా ఉన్నట్లు తెలుస్తోంది.

పట్టుబడితే అంతే..

ట్యాక్సీ ప్లేట్, సరుకు రవాణా వాహనాలకు సంబంధించి ప్రతి మూడు నెలలకు ఒక్కసారి పన్ను కట్టాల్సి ఉంటుంది. గడువులోగా చెల్లిస్తే ఎలాంటి సమస్య ఉండదు. అదే గడువు దాటాక 50శాతం ఫైన్‌తో చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ సమయం ముగిసిన తర్వాత ఆర్టీఏ అధికారులు తనిఖీల్లో పట్టుబడితే మాత్రం 200శాతం ఫైన్ కట్టాలి. అంటే రూ.1,000కి అదనంగా రూ.2వేలు చెల్లించాల్సి వస్తుంది. అప్పటి దాకా వాహనాన్ని సీజ్ చేస్తారు. ఉన్నతాధికారులు ఇచ్చిన రూ.35లక్షల టార్గెట్‌ను పూర్తి చేయడానికి ఆర్టీఏ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. పన్ను చెల్లించని వాహనాలు కనిపిస్తే ఫైన్ వేస్తున్నారు. కట్టలేని వారి వాహనాలను సీజ్ చేస్తున్నారు. సరుకు రవాణా వాహనాలు, ప్రయాణికులను చేరవేసే వాహనాలు, స్కూల్ బస్సులు, వ్యాపార సంబంధమైన ట్రాక్టర్లు వంటి వాటి పన్నుల వసూలుపై దృష్టి సారించారు.

> **గడువులోగా చెల్లించాలి**
>
> ఎల్లో ప్లేట్ వాహనాలకు సంబంధించిన పన్నులను మీసేవా కేంద్రంలో చెల్లించవచ్చు. చాలా మంది వాహనదారులు ఆర్టీఏ కార్యాలయంలోనే కట్టాలనే అపోహలో ఉన్నారు. మూడు నెలలకు ఒక్కసారి క్రమం తప్పకుండా పన్ను చెల్లిస్తే ఎలాంటి అపరాధ రుసుం పడదు. ఈ విషయాన్ని వాహన యజమానులు గుర్తించుకోవాలి.
>
> – వెంకట్‌రెడ్డి, డీటీఓ, వికారాబాద్

ఆదివాసీల సంక్షేమానికి పెద్దపీట

- విద్యతోనే భవిష్యత్ మారుతుంది
- అర్హులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

పెద్దేముల్: ఆదివాసీల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దేముల్ మండలం చైతన్యనగర్(చెంచుకాలనీ)లోని బహుళ ప్రయోజన కమ్యూనిటీ భవనంలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంబేడ్కర్, కొమురంభీం, చెంచులక్ష్మి ఫొటోలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ఉన్నత స్థానానికి చేరాలంటే చదువు ఒక్కటే మార్గమన్నారు. విద్యతోనే భవిష్యత్ మారుతుందని పేర్కొన్నారు. అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జన్‌మాన్ యోజన ద్వార గ్రామంలో వసతులు కల్పించుకోవాలని సూచించారు. విద్యుత్, మంచినీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణానికి ఇంటింట సర్వే నిర్వహించి సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని మండల అధికారులను ఆదేశించారు. అణగారిన ప్రజల ఎదుగుదలకు అంబేడ్కర్ కృషి మరువలేనిదన్నారు. ఆదివాసీల సంక్షేమం కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకొని సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలన్నారు. గ్రామంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి చెంచులకు కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. చెంచులకు ప్రభుత్వం ఏ పథకం అమలు చేసినా పెద్దేముల్ మండలానికి మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. నేటి బాలురే రేపటి పౌరులన్నారు. పోడు భూముల సమస్యలను తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. విప్ప చెట్లు కల్పవృక్షం లాంటివని, ఆసక్తి ఉన్న రైతులు ముందుకు వస్తే వారికి మొక్కలను సరఫరా చేస్తామని తెలిపారు. అంతకుముందు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆలపించిన పాటలు, విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆదివాసీల సంక్షేమానికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులను, సంఘం నాయకులను కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కమలాకర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ పాల్వన్‌కుమార్, డీఎల్‌పీఓ శంకర్‌నాయక్, మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, తహసీల్దార్ కిషన్, ఎంపీడీఓ జర్నప్ప, ఎంపీఓ రతన్‌సింగ్, ఆదివాసీ సంఘం రాష్ట్ర నాయకులు అంజయ్య, హన్మంతు, ఆంజిలప్ప, లాలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

నిబద్ధతతో పని చేస్తే గుర్తింపు

షాద్‌నగర్‌రూరల్: విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసే ఉద్యోగులకు తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ శంకర్‌రాథోడ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని ఎలికట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో బదిలీపై వచ్చిన, వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎంఈఓ శంకర్‌రాథోడ్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో బదిలీలు సర్వసాధారణమని అన్నారు. ఉద్యోగులు ఎక్కడ పని చేసినా తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. సన్మానం పొందిన వారిలో గీత, వందన, బుగ్గమ్మ, గీతమ్మ, కృష్ణమ్మ, మాలతీ, స్వప్న, రేణుక, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయిప్రసాద్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ శ్రీశైలం, మాజీ సింగిల్‌విండో డైరెక్టర్ చంద్రయ్య, మాజీ ఉప సర్పంచ్ నుసీత రాజు, నాయకులు సంజీవయాదవ్, మధుకర్‌గౌడ్, శ్రీశైలం, బుద్ధనర్సింలు, ప్రధానోపాధ్యాయురాలు సక్కుబాయి పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడుకుందాం

- ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్



విద్యార్థినులతో కలిసి మొక్కలు నాటిన అధికారులు

అనంతగిరి: మొక్కలను పెంచి ప్రకృతిని కాపాడుకుందామని ఎక్సైజ్ కమిషనర్ ఈ.శ్రీధర్ అన్నారు. శుక్రవారం స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ మండలం ఘట్ కొండాపూర్, అనంతగిరి అటవీ పరిసరాల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటడం వల్ల భవిష్యత్ తరాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జైదుపల్లి పాఠశాల విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. భవిష్యత్‌లో ఏ రంగాన్ని ఎంచుకుంటారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అటవీ ప్రాంతంలోని హిల్ వ్యూ పాయింట్ నుంచి అటవీ అందాలను తిలకించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, అటవీ శాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, డీవైఎస్ఓ హనుమంతరావు, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ దశరథ, జిల్లా సూపరింటెండెంట్ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మా పోరాటానికి అండగా నిలవండి

- కేటీఆర్‌ను కోరిన పలు గ్రామాల రైతులు
- ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వమని తేల్చిచెప్పిన వైనం



కేటీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

దుద్యాల్: ఫార్మా కంపెనీ ఏర్పాటుకు నిరసనగా తాము చేసే పోరాటానికి అండగా నిలవాలని మండలంలోని పలు గ్రామాల రైతులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను కోరారు. శుక్రవారం మండలంలోని లగచెర్ల, హకీంపేట, పోలేపల్లి, పులిచెర్ల తండా, ఆర్‌బీ తండాకు చెందిన రైతులు నగరంలో కేటీఆర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం బాధిత రైతులు మాట్లాడుతూ.. సాగు భూములను ఫార్మా కంపెనీ కోసం తీసుకోవడం సరికాదన్నారు. కొన్ని తరాలుగా వ్యవసాయమే ఆధారంగా జీవనం సాగిస్తున్నామని తెలిపారు. పర్యావరణానికి, మానవ మనుగడకు ఎంతో ప్రమాదకరమైన ఫార్మా కంపెనీలు మా ప్రాంతంలో పెట్టరాదని డిమాండ్ చేశారు. పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా తాము చేసే పోరాటానికి మద్దతుగా నిలవాలని కేటీఆర్‌ను కోరినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టే నిర్ణయాలు తీసుకుంటోందని, అన్నదాతలకు అండగా పోరాటం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు కేటీఆర్ వివరించినట్లు తెలిపారు. కంపెనీ ఏర్పాటుపై ముఖ్యమంత్రి పునరాలోచించాలని రైతులు కోరారు. కార్యక్రమంలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, దౌల్తాబాద్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోట్ల మైపాల్, బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు సురేశ్, నాయకుడు రాజు నాయక్, రైతులు యాదయ్య, బసప్ప, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

హాస్టళ్లలో వసతులు కల్పించాలి

- స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని వసతులు ఉండాలని, ఆ దిశగా అధికారులు చొరవ చూపాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ సూచించారు. శుక్రవారం వికారాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో మండల అధికారులు, వార్డెన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో విద్యార్థుల అడ్మిషన్లు, ఖాళీల భర్తీ కోసం పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు వసతి గృహాలను తనిఖీ చేయాలన్నారు. విద్యార్థుల చదువుపై వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పిల్లల ఆరోగ్యం, మానసిక వికాసంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, బీసీ, ఎస్టీ వెల్ఫేర్ ఆఫీసర్లు మల్లేశం, ఉపేందర్, కమలాకర్‌రెడ్డి, ఆయా మండలాల ఎంపీడీఓలు తహసీల్దార్లు, ఎంఈఓలు, వార్డెన్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాఠశాల సామగ్రి వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

దోమ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో రేకులు, టేకు కట్టెలు, కిటికీలను అధికారులు శుక్రవారం వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో ఆరుగురు సభ్యులు పాల్గొనగా, పరిగి పట్టణానికి చెందిన ఆసిఫ్ రూ.43,500లకు రేకులను సొంతం చేసుకున్నారు. మిగతా సామగ్రి వేలానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేశామని తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీఓ మహేశ్‌బాబు తెలిపారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్



బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే

నవాబుపేట: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. మండల పరిధి అక్నాపూర్ గ్రామానికి చెందిన పెద్దోల్ల రాములు ఆరోగ్య సమస్యలతో నగరంలోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. అతని వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ కింద వారి కుటుంబ సభ్యులకు శుక్రవారం రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న నవీన్‌కుమార్

అనంతగిరి: భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా టి.నవీన్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు శుక్రవారం మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడారు. తనపై నమ్మకంతో రాష్ట్రస్థాయి బాధ్యతలు అప్పగించినందుకు సంతోషంగా ఉందని తెలిపారు. ఇందుకు సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

యువకుడి అదృశ్యం

మొయినాబాద్: పనికి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన మండల పరిధిలోని పెద్దమంగళారంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన పుల్లగల్ల హరిబాబు(28) పదిహేను రోజులుగా మండల పరిధిలోని భాస్కర మెడికల్ కళాశాలలో పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే ఈ నెల 5న ఉదయం పనికి వెళ్లిన తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పనికి వెళ్లిన ప్రదేశంతోపాటు పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

డీడీలు వాపస్!

- రెండో విడత గొర్రెల పంపిణీకి స్వస్తి
- వాటా చెల్లించిన లబ్ధిదారులు 664



దౌల్తాబాద్: గొల్లకుర్మల ఆర్థికాభివృద్ధికి గత ప్రభుత్వం గొర్రెల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విడతల వారీగా జీవాల పంపిణీ చేపడతామని చెప్పింది. అనుకున్నట్లుగా తొలి విడతలో 666 మంది లబ్ధిదారులకు సరఫరా చేసింది. మలి విడతకు కాలయాపన చేసింది. ఈ క్రమంలో రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరింది. గొర్రెల పంపిణీలో అవినీతి అక్రమాలు జరిగాయంటూ ప్రస్తుత ప్రభుత్వం పథకానికి స్వస్తి పలికింది. డీడీలు చెల్లించిన వారి వాటా సొమ్మును చెల్లించాలని ప్రభుత్వం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేసింది. ప్రభుత్వం ఆదేశాల మేరకు విడతల వారీగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బు జమ అవుతోంది. దీంతో గొర్రెల కోసం ఎదురు చూసిన కాపలా దారుల ఆశలు అడియాశలయ్యాయి.

మండలంలో లబ్ధిదారులు

దౌల్తాబాద్ మండల పరిధి గ్రామాల్లో 1,330 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో మొదటి విడతలో 666 మందికి గొర్రెలు రాగా.. రెండో సారి 664 మందికి అందాల్సి ఉంది. మొదటి లబ్ధిదారులు యూనిట్ విలువలో 25శాతం రూ.31,250, రెండోసారి ప్రభుత్వం యూనిట్ విలువను పెంచడంతో రూ.43,750లను డీడీ రూపంలో చెల్లించారు. రెండో విడత లబ్ధిదారులు డబ్బులు చెల్లించి సంవత్సరాలు గడిచింది. అయితే నాటి బీఆర్‌ఎస్ సర్కార్ పంపిణీలో జాప్యం చేయగా.. పథకంలో అక్రమాలు జరిగాయంటూ కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీని నిలిపివేసింది. వాటాదారుల సొమ్మును వారి వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తోంది.

> **వాటా సొమ్ము చెల్లిస్తున్నాం**
>
> రెండో విడత గొర్రెల పంపిణీ పథకానికి డీడీలు చెల్లించిన లబ్ధిదారులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నాం. మరో 18 మందికి రావాల్సి ఉంది. త్వరలో జమ చేస్తాం. – హఫిక్, పశువైద్యాధికారి

నామినీ ఖాతాలో డబ్బులు జమ

రెండో విడత గొర్రెల కోసం డీడీలు చెల్లించి మృతి చెందిన లబ్ధిదారుల నామినీ ఖాతాలో వాటా ధనం జమచేయనున్నారు. అందుకు గాను నామినీ పేరున సంఘం తీర్మానం, లబ్ధిదారుడి డెత్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, నామినీ బ్యాంకు వివరాలు డీడీ నంబరుతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అర్జీలను మండల పశువైద్యాధికారులకు అందజేయాలి

సిబ్బంది కొరత తీరితే.. నాణ్యమైన విద్య



సభ్యత్వ నమోదు చేస్తున్న చంద్రశేఖర్

- 317 జీఓ సమస్యను పరిష్కరించాలి
- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్

ధారూరు: సిబ్బంది కొరత సమస్యను పరిష్కరిస్తే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. ఇందులో భాగంగా ప్రతి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడితో పాటు, ప్రతి తరగతి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో మండల పరిధి గట్టెపల్లి, రాంపూర్‌తండా, ఎబ్బనూర్, చింతకుట, హరిదాస్‌పల్లి, కేరెళ్లి, బాచారం గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 317 జీఓ సమస్యను వెంటనే పరిష్కరించాలని, పెండింగ్ డీఏ, బిల్స్‌ను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. పీఆర్సీ కమిటీ నుంచి రిపోర్టు తెప్పించుకుని 50 శాతం పీఆర్సీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చయ్య, బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో సమావేశమైన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్

ఫీవర్ సర్వే చేపట్టండి

- మెరుగైన వైద్య సేవలందించాలి
- అభాగ్యులను ఆలన పాలియేటివ్ కేర్‌లో చేర్పించాలి
- డివిజన్ వైద్యాధికారుల సమీక్షలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్

చేవెళ్ల: డివిజన్ పరిధి అన్ని గ్రామాల్లో ఫీవర్ సర్వే చేపట్టాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఇటీవల కొత్తగా వచ్చిన వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల బదిలీల్లో డివిజన్‌కు నలుగురు కొత్త వైద్యులతో పాలుగా 41 మంది పారామెడికల్ సిబ్బంది వచ్చారన్నారు. ఈ సందర్భంగా పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేసి వైద్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అనంతరం దామోదర్ మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఆస్పత్రుల్లో ఓపీ సేవలను విస్తరించాలని సూచించారు. అనారోగ్యంతో బాధపడుతున్న అభాగ్యులను ఆలన పాలియేటివ్ కేర్‌లో చేర్పించి వైద్య సేవలు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సంతోష, బలరాం, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రాజేంద్రనగర్: తాళం వేసిన ఇంట్లో దొంగలు చొరబడి బంగారు, వెండి ఆభరణాలతో పాటు విలువైన డాక్యుమెంట్లు, నగదును అపహరించారు. ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రాజేంద్రనగర్ నలందనగర్ కాలనీలో రాజేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. రాజేష్ బావమరిది చనిపోవడంతో ఇంటికి తాళం వేసి వెళ్లాడు. అక్కడే అతడి భార్య అస్వస్థతకు గురి కావడంతో ఆస్పత్రికి తరలించాడు. అనంతరం రాజేష్ శుక్రవారం ఉదయం నలందనగర్‌లోని తన ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలో భద్రపరిచిన 40 తులాల బంగారు ఆభరణాలు, వెండి ఆభరణాలు, విలువైన డాక్యుమెంట్లు, రూ.4 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వృద్ధురాలి అదృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: కొడుకులపై మనస్తాపం చెందిన ఓ వృద్ధురాలు ఇంటి నుంచి బయటికి వెళ్లిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయిబాబా నగర్ ప్రాంతానికి చెందిన బాలమణి (65) కొన్ని సంవత్సరాలుగా నలుగురు కొడుకుల దగ్గర ఉండేది. ఈ క్రమంలో తల్లిని చూసుకునే విషయంలో కొడుకులు గొడవలు పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన బాలమణి ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినప్పటికీ కనబడకపోవడంతో శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

పరిగి: వేర్వేరు రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయాల పాలయ్యారు. ఈ సంఘటన మండల పరిధి సుల్తాన్‌పూర్, చిట్యాల గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూర్ గ్రామానికి చెందిన రాజుగౌడ్, జ్యోతి దంపతులు కుల్కచర్ల నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా, చిట్యాల సమీపంలో షాద్‌నగర్ నుంచి పరిగి వెళ్తున్న పాల ట్యాంకర్ వీరు పయనిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. సుల్తాన్‌పూర్ గేట్ సమీపంలో వేగంగా వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొన్న మరో ప్రమాదంలో దశరథ్, కల్యాణ్‌లకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఇరువురిని పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దశరథ్‌కు తలకు తీవ్ర గాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం వికారాబాద్ జిల్లా కేంద్రానికి తరలించారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ నాయక్

చేవెళ్ల: లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దని రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని సిల్వర్ డేల్ ది హైస్కూల్‌లో శుక్రవారం చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశం ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. మైనర్లు వాహనాలు నడిపేత వారి ప్రాణాలతో పాటుగా ఎదుటి వారి ప్రాణాలకు ముప్పు కలగనుందని పేర్కొన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారితో పాటుగా వాహన యజమానిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రిపుల్ రైడింగ్, ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, రాంగ్‌రూట్, రాష్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవ్ చేయడం ట్రాఫిక్ ఉల్లంఘనల కిందకే వస్తుందని తెలిపారు. విద్యార్థులు జీబ్రా క్రాసింగ్ లైన్స్, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్దనే రోడ్డు దాటాలని సూచించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలని సూచించారు. కారులో సీటు బెల్ట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మోనాచారి, ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో లాయర్లు కీలకం

- వారి రక్షణకు ప్రత్యేకం చట్టం తేవాలి
- రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభ్‌ప్రద్ పటేల్



న్యాయవాదులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేస్తున్న శుభ్‌ప్రద్ పటేల్

అనంతగిరి: 'ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయవాదుల పాత్ర కీలకం. ప్రజల హక్కులను కాపాడేందుకు పోరాడే వారిపై దాడులు చేయడం సరికాదు. లాయర్లకు భద్రత కల్పించాలి. అందుకోసం ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది' అని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. ఇటీవల జనగామలో లాయర్లపై జరిగిన దాడికి నిరసనగా శుక్రవారం వికారాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట న్యాయవాదులు నిరసన దీక్ష చేశారు. దీక్షకు సంఘీభావంగా శుభ్‌ప్రద్ మాట్లాడారు. ప్రతి చిన్న విషయానికి న్యాయవాదులపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. వారికి రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని పునఃరుద్ఘాటించారు. అనంతరం నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ కయ్యూమ్, జనరల్ సెక్రటరీ వెంకటేశ్, సీనియర్ న్యాయవాదులు కమల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, బస్వరాజు, సంపూర్ణ ఆనంద్, యాదవ రెడ్డి, మాధవ రెడ్డి, నారాయణ, వసుంధర, జగన్, కిరణ్ పటేల్, రఫీ, మహేశ్వర రెడ్డి, శ్రీనివాస్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల్లో సమస్యలకు పరిష్కారం

రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి



తుర్కయంజాల్: మల్‌రెడ్డితో కాలనీవాసులు

తుర్కయంజాల్: మున్సిపల్ పరిధిలోని ప్రధాన సమస్యలకు మూడు నెలల్లో పరిష్కరిస్తామని రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన తుర్కయంజాల్, రాగన్నగూడలోని పలు కాలనీల్లో పర్యటించారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని సూచించారు. అనంతరం ఆయా కాలనీల్లో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కమిషనర్ అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రం చేయడం, శిథిలావస్థకు చేరిన భవనాల తొలగింపు, ఇంటింటికీ మొక్కల పంపిణీ, యాంటీ లార్వా స్ప్రే చేయడం తదిదర కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరితాధన్‌రాజ్ గౌడ్, కౌన్సిలర్లు మాధవి, కీర్తన, మంగమ్మ, ఆర్.ఓ. శ్రీనివాసులు, డీఈ సత్యనారాయణ, ఏఈ భిక్షపతి, సానిటరీ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు సహకారం

హయత్‌నగర్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. శుక్రవారం తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో మునుగనూరు వేద విద్యానగర్ కాలనీలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆలయానికి మౌలిక సదుపాయాల కల్పనకు సహకరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ హరితాగౌడ్, స్థానిక కౌన్సిలర్ స్వాతిరెడ్డి, సునీల్ రవీందర్‌రెడ్డి, వర్మన్, గోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్, దాసు తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇచ్చి.. దారి దోపిడీ

నవాబుపేట: ఆటో కోసం ఎదురు చూస్తున్న మహిళలను సాయం చేస్తానని కారులో ఎక్కించుకొని బంగారం లాక్కొని పరారైన సంఘటన మీనాపల్లికలాన్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్ల రాములు భార్య మహేశ్వరి.. మోమినిపేట మండలం కేసారం నుంచి తల్లి కాంతమ్మ, కూతురుతో కలిసి మీనాపల్లికలాన్‌కు వస్తున్నారు. ఈ క్రమంలో కొజ్జావలంపల్లి గేటు వద్ద బస్ దిగి.. మీనాపల్లికి వెళ్లడానికి ఆటో కోసం ఎదు రు చూస్తున్నారు. ఈ సమయంలో ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులతో వచ్చిన కారు వీరి వద్ద ఆగింది. తాము కూడా అదే మార్గంలో వెళ్తున్నామని, మీనాపల్లికలాన్‌లో దిగబెట్టి వెళ్తామని నమ్మబలికి వాహనం ఎక్కించుకున్నారు. కొద్ది దూ రం వెళ్లిన తర్వాత మహేశ్వరి మెడలోని మూడు తులాల బంగారు పుస్తెల తాడును లాక్కుని కారులోంచి దింపేసి ఉడాయి ంచారు. బాధితురాలి భర్త రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భరత్ భూషణ్ తెలిపారు.

పోస్టాఫీసుల్లో జాతీయ జెండాల విక్రయం

సాక్షి, సిటీబ్యూరో: పంద్రాగస్టు సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను సగర్వంగా ఎగురవేసే విధంగా ప్రోత్సహించేందుకు 'హర్ ఘర్ తిరంగ 3.0' కింద పోస్టాఫీసుల్లో జాతీయ జెండాల విక్రయాన్ని ప్రారంభించినట్లు తెలంగాణ పోస్టల్ సర్వీసెస్ అసిస్టెంట్ డైరెక్టర్ హెచ్.శరత్‌కుమార్ వెల్లడించారు. పోస్టాఫీసులతోపాటు ఆన్‌లైన్ ద్వా రా కూడా అందిస్తు న్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో ఐదు ఫ్లాగ్‌ల వరకు కొనుగోలు చేయ వచ్చని, బుక్ చేసిన ఫ్లాగ్‌లను అదనపు చార్జీ లు లేకుండా ఆయా చి రు నామాలకు పంపడం జరుగుతుందన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

ఏసీపీ రంగస్వామి



ఓ కిరాణ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్‌రూరల్: అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఏసీపీ రంగస్వామి హెచ్చరించారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, మెయిన్‌రోడ్డు, మహబూబ్‌నగర్ రోడ్డులో సీఐ విజయకుమార్, రూరల్ సీఐ సత్యనారాయణ, సిబ్బందితో కలిసి కిరాణా షాపులు, పాన్‌షాపులు, లాడ్జిలు, వ్యాపార సముదాయాల్లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి, గుట్కా, మత్తు పదార్థాల అమ్మకాలపై ఆరా తీశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. అసాంఘీక కార్యకలాపాలతో పాటు డ్రగ్స్, గుట్కా, ఇతర మత్తు పదార్థాల క్రయ విక్రయాలపై దృష్టి సారించినట్టు తెలిపారు. లాడ్జీల్లో అపరిచిత వ్యక్తులు బసచేయడం, రద్దీ ప్రాంతాల్లో దొంగలు, పాత నేరస్తుల కదలికలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకోసం గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎక్కడ గంజాయి, గుట్కా, మత్తు పదార్థాల క్రయ విక్రయాలు జరిగినా, అసాంఘీక కార్యక్రమాలపై పోలీసులకు సమాచారం అందించవచ్చని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని అన్నారు. కాలనీల్లో అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించినా, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తొమ్మిదోసారి..

- జలమండలి ఈడీ పదవీ కాలం మరోసారి పొడగింపు
- పదవీ విరమణ చేశాక.. కీలక పోస్టులో 8 ఏళ్లుగా ఒకే అధికారి

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) సత్యనారాయణ పదవీ కాలం మరో ఎడాది పొడిగించారు. పదవీ విరమణ చేసినా ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న ఆయన పదవీ కాలం..తొమ్మిదో సంవత్సరం కూడా ప్రభుత్వ పొడిగించింది. 2016లో ఈడీగా పదవీ విరమణ చేసిన సత్యనారాయణ..పొడిగింపు మీద ఇప్పటికీ అదే పోస్టులో కొనసాగుతూ వస్తున్నారు. జూలై నెలాఖరుతో పదవీ కాలపరిమితి ముగియ గా ,తాజాగా మరో ఏడాది పొడిగిస్తూ మున్సిపల్ శాఖ కార్యదర్శి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పదవీ విరమణ చేసి విధుల్లో కొనసాగుతున్న ఉన్నతాధికారులందర్నీ ఇంటికి పంపించగా, జలమండలిలో మాత్రం సీన్ మారలేదు. ఈడీ పదవీ కాలాన్ని పొడిగించడం విస్మయానికి గురిచేస్తోంది. జూన్ నెలలోనే అప్పటి జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి ఈడీ పదవీ కాలాన్ని మరో ఎడాది పొడిగింపు కోసం ప్రభుత్వానికి సిఫార్సు చేసినప్పటికి మొన్నటి వరకు ఫైల్ పెండింగ్‌లో ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటలో ఉన్న సమయంలో దస్త్రంపై సంతకమై..పొడిగింపు ఆదేశాలు వెలువడటం పలు అనుమానాలకు తావిస్తోంది. పదవీకాలం పొడిగింపుపై జలమండలి అధికారులు, ఇంజనీర్లలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. వాస్తవంగా జలమండలి ఎండీ, ఈడీ పోస్టుల్లో ఐఏఎస్ అధికారులను నియామించాల్సి ఉంటుంది. కానీ. ఇంజనీర్-ఇన్-చీఫ్ స్థాయి అధికారి కొనసాగడం పలు విమర్శలకు తావిస్తోంది.

ఆపరేషన్‌కు తీసుకెళ్లి.. శవంగా మార్చారు



భాస్కర ఆస్పత్రి వద్ద బంధువులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తుల ఆందోళన

- మహిళ ప్రాణం తీసిన వైద్యుల నిర్లక్ష్యం
- ఆస్పత్రి ఎదుట బాధితుల ఆందోళన



సావిత్రి(ఫైల్)

మొయినాబాద్: కాలికి గాయమై నడుచుకుంటూ ఆస్పత్రికి వెళ్లిన తన భార్యను.. శవంగా తిరిగిచ్చారని మృతురాలి భర్త రోదించాడు. వైద్యుల నిర్లక్ష్యం తమ తల్లి ప్రాణాలను పొట్టన పెట్టుకుందని కూతుర్లు విలపించారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ పీఎస్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు, మృతురాలి బంధువుల వివరాల ప్రకారం.. అమ్డాపూర్ గ్రామానికి చెందిన మద్దెపాగ రమేశ్ భార్య సావిత్రి(30) ఐదు రోజుల క్రితం ఇంటి వద్ద ప్రమాదవశాత్తు కింద పడింది. దీంతో కాలికి గాయమైంది. కుటుంబ సభ్యులు ఆమెను అమ్డాపూర్ చౌరస్తాలోని భాస్కర ఆస్పత్రికి తరలించగా కాలు విరిగిందని, ఆపరేషన్ అవసరమని వైద్యులు సూచించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం శస్త్రచికిత్స కోసం థియేటర్‌లోకి తీసుకెళ్లారు. సాయంత్రమైనా సావిత్రిని కుటుంబ సభ్యులకు చూపించలేదు. దీంతో అనుమానం వచ్చి గట్టిగా నిలదీయడంతో థియేటర్‌లోకి అనుమతించారు. అప్పటికే ఆమె అపస్మారక స్థితిలో ఉండటంతో ఏం జరిగిందని డాక్టర్లను ప్రశ్నించారు. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో బంధువులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. కొద్దిసేపటి తర్వాత అక్కడకు చేరుకున్న పోలీసులకు సావిత్రి మృతి చెందిందని ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. దీంతో ఆగ్రహానికి గురైన స్థానికులు ధర్నాకు దిగారు. మృతురాలికి భర్త రమేశ్, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. రమేశ్ ఇదే ఆస్పత్రిలో దినసరి కూలీగా పనిచేస్తున్నారు. ఇంత జరిగినా ఆస్పత్రి యాజమాన్యం మాత్రం తమ తప్పేమీలేదన్నట్లు వ్యవహరిస్తుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయకుండా ఉండేందుకు బాధిత కుటుంబ సభ్యులతో బేరసారాలు చేస్తున్నట్లు బంధువులు ఆరోపించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.